క్లుప్తంగా

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



బోధన్‌రూరల్(బోధన్): పెంటాకలాన్ సొసైటీ చుట్టూ ఏర్పాటు చేస్తున్న ప్రహరీ నిర్మాణ పనులకు సొసైటీ అధ్యక్షుడు దొనకంటి రాజారెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. రూ.10లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పాలాభిషేకం



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆరు గ్యారంటీలలో భాగంగా 200 యూనిట్లలోపు ఉచిత బిల్లు, రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, జిల్లా నాయకులు దేగాం గంగారెడ్డి, పెంట ఇంద్రుడు, మోర్తాడ్ బోజారెడ్డి, దేవిదాస్, వైఎస్ గంగాధర్ పాల్గొన్నారు.

వర్ని బీజేపీ అధ్యక్షుడి నియామకం



వర్ని: మండల బీజేపీ అధ్యక్షుడిగా జలాల్పూర్ గ్రామానికి చెందిన ఇల్తేమ్ శంకర్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శంకర్‌కు అందజేశారు. అలాగే చందూరు మండల అధ్యక్షుడిగా మదిశెట్టి విఠల్, మోస్రా అధ్యక్షుడిగా సంఘ అనిల్‌లను నియమించారు.

పుస్తకావిష్కరణ



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రం చరిత్ర ఆధారంగా స్థానిక రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సింగ్ రావు రచించిన అల్లకొండ ఊరు ఉద్భవం- ఐదు ఆలయాలకు ప్రసిద్ధి అనే పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. బాల్కొండ ఖిల్లా, దవాలను చరిత్రను ఆధారంగా చేసుకుని పుస్తకాన్ని రచించారు. భావితరాలకు చరిత్రను అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

మాశెట్టి నర్సయ్యకు అవార్డు



బోధన్ టౌన్(బోధన్): బోధన్‌కు చెందిన వ్యాపార వేత్త, సామాజిక కార్యకర్త, సంఘ సేవకులు మాశెట్టి నర్సయ్యను మరో అవార్డు వరించింది. బోధన్ పట్టణంతో పాటు వివిధ మండలాల్లో, లయన్స్ క్లబ్ ఆఫ్ సేవాలో, చక్రేశ్వర ఆలయ పాలక వర్గంలో ఆయన చేసిన సేవలను గుర్తించి సేవ్ సీవీరామన్ సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవనంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మాశెట్టికి ఈ అవార్డు వరించడంతో వ్యాపారస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

హైదరాబాద్ బయలుదేరిన కొత్తగా ఎంపికైన ఉద్యోగులు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు బస్ సౌకర్యం ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో జరగబోయే సీఎం కార్యక్రమానికి వెళ్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను సీఎం అందించనున్నారు.

క్రీడా ప్రాంగణాలే కల్లాలు..!

- బాల్కొండ మండలం బస్సాపూర్‌లో దుస్థితి
- పరికరాలు లేవు.. క్రీడలు ఆడేది లేదు



బాల్కొండ: తెలంగాణ క్రీడా ప్రాంగణాలు క్రీడలు లేక కల్లాలుగా మారుతున్నాయి. బాల్కొండ మండలం బస్సాపూర్‌లో తెలంగాణ క్రీడా ప్రాంగణం రైతులకు పంట దిగుబడులు ఆరబెట్టడానికి కల్లాలుగా ఉపయోగపడుతున్నాయి. పల్లె ప్రగతిలో భాగంగా గత ప్రభుత్వం గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. కేవలం బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు అధికారులు. కనీసం ఇప్పటి వరకు ఎలాంటి క్రీడా సామాగ్రిని తీసుకురాలేదు. క్రీడలు లేవు.. క్రీడా పరికరాలు లేవు. దీంతో ఉన్న క్రీడా ప్రాంగణాలు రైతులకు పంట దిగుబడులు ఆరబెట్టుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ముళ్ల పొదలతో నిండిపోయాయి. అయినా వాటిని పట్టించుకునే నాథుడే లేడు. అసలు బస్సాపూర్‌లో క్రీడా ప్రాంగణం అధికారుల టార్గెట్ కోసం చివరగా ఏర్పాటు చేశారు. అది వరద కాలువ అంచున ఏర్పాటు చేసి వరద కాలువ తవ్వకంలో వెళ్లిన మొరం తరలించి, చదును చేసి బోర్డు పెట్టి ఇదే క్రీడా ప్రాంగణం అని అనిపించారు. కాని అది ప్రస్తుతం కల్లాలకు ఉపయోగపడుతుంది. క్రీడా ప్రాంగణానికి కనీసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. చుట్టూ మొక్కలు కూడా పెంచలేదు.

ఇంకా అందని క్రీడా పరికరాలు

ఉమ్మడి బాల్కొండ మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. కాని ఇప్పటి వరకు రెండేళ్లు గడుస్తున్నా క్రీడా పరికరాలు రాలేదు. అసలు క్రీడా ప్రాంగణాలు ఉన్నట్లు అధికారులకు గుర్తుందో లేదోనని క్రీడాకారులు అంటున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకుని వెంటనే క్రీడా సామగ్రిని సరఫరా చేయాలని, క్రీడా ప్రాంగణాలను కాపాడాలని క్రీడాకారులు కోరుతున్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మాక్లూర్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి ప్రకాష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ముందుగా దిష్టిబొమ్మను ఊరేగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిందాబాద్.. బండి సంజయ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్, సీనియర్ నాయ కుడు గంగాధర్‌గౌడ్‌లు మాట్లాడుతూ..బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. పొన్నం ప్రభాకర్ అనని మాటను అన్నట్టు భావించుకుని అలా మాట్లాడటం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ మండల నాయకులు లచ్చారెడ్డి, ఎస్ వెంకటేశ్వర్‌రావు, మాక్లూర్ మాజీ సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

రైతులకు సమస్యలు రాకుండా చూసుకోవాలి



వర్ని(మోస్రా): ధరణిలో రైతులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని మోస్రా జెడ్పీటీసీ గుత్ప విజయభాస్కర్ రెడ్డి సూచించారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో ధరణిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే అధికారులు ముందుగానే సవరించాలని, రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. తహసీల్దార్ మారుతి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



రుద్రూర్: నిర్దేశిత సమయంలో ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలని బోధన్ డీఎల్‌పీవో సాయి బాబా ఆదేశించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జీపీ కార్యదర్శులు, కారోబార్‌ల సమావేశంలో మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఈ నెల 20లోపు వంద శాతం పన్నులు పూర్తి చేయాలన్నారు. బృందాలుగా ఏర్పడి ప్రతి రోజు ఉదయం కేటాయించిన గ్రామానికి చేరుకుని వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి మారుతి, జీపీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు



బోధన్‌టౌన్(బోధన్): పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు సోమవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువాలను కప్పి ఎమ్మెల్యే, కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. 4వ వార్డు కౌన్సిలర్ ధూప్ సింగ్, 36వ వార్డు కౌన్సిలర్ జావిద్‌లు పార్టీలో చేరారు.

సొసైటీ సీఈవో పదవీ విరమణ



బోధన్ రూరల్: పెంటాకుర్దు సొసైటీ కార్యదర్శి పోతారెడ్డి సోమవారం పదవీ విరమణ చేశారు. సొసైటీ చైర్మన్ అమర్నాథ్ బాబు అధ్యక్షతన సొసైటీ ఆవరణలో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోతారెడ్డి దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోగా రావుఫ్‌ను నియమిస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీంద్ర బాబు వెల్లడించారు. సొసైటీ వైస్ చైర్మన్ రమేష్ గౌడ్, పెంటాకుర్దు మాజీ సర్పంచ్ వీరన్న పటేల్, సాలూరా పీఏసీఎస్ సీఈవో బస్వంత్ రావు, మానిటరింగ్ అధికారి అరుణ్ పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

బాల్కొండ/నందిపేట: తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ, మెండోరా, కమ్మర్‌పల్లి మండలాల అధ్యక్షులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, సుంకెట రవి, నందిపేట నాయకులు దేగాం గంగారెడ్డి, పిప్పెర సాయరెడ్డి, పెంట ఇంద్రుడులు తదితరులు ఉన్నారు.



గంద్ర వెంచర్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు

మాక్లూర్: మాణిక్‌భండార్ శివారులో దేవాదాయ భూమి 16 ఎకరాలతో పాటు, అక్కడ ఉన్న ఓ చెరువు శిఖం భూమిని కూడా వెంచర్‌లో కలిపి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ గంద్ర వెంచర్ యజమానులపై రెండవ డివిజన్ కార్పొరేటర్ మాలవత్ రాయ్‌సింగ్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జా విషయమై గంద్ర వెంచర్ యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు గ్రామస్తులతో పాటు తనను బెదిరింపులకు గురి చేశారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు కార్పొరేటర్ రాయ్‌సింగ్ తెలిపారు. విచారణ జరిపించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

సంక్షిప్తం

■ **ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం**



బోధన్‌రూరల్(బోధన్): పెగడాపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ **ఎంపీ అర్వింద్ ప్రత్యేక పూజలు**



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మికాలనీలో గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ 17వ వార్షికోత్సవ ఉత్సవాలను భక్తులు నిర్వహిస్తున్న క్రమంలో వారు ఆలయాన్ని సందర్శించి ఆశీస్సులు తీసుకున్నారు. వారి వెంట బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె గంగారెడ్డి తదితరులున్నారు.

■ **శివాలయంలో..**



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపై గల దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మ, హనుమాన్ ఆలయాలను సందర్శించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించారు.

■ **నేటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు**

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. దీంతో ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాలలో భాగంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు.



■ **గోదావరి నది ఒడ్డున వేడుకలు**

నందిపేట మండలం ఉమ్మెడ శివారులోని గోదావరి నది ఒడ్డున గల ఉమా మహేశ్వర ఆలయం భారీ వర్షాల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండడంతో మునిగిపోయింది. ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో ఇటీవలే బయటపడింది. శివరాత్రి ఉత్సవాలను ఉమ్మెడ గ్రామాభివృద్ధి కమిటీతో పాటు యువకులు ముందుకు వచ్చి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. శివరాత్రి మరుసటి రోజు అన్నదానం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రభుత్వాలు మారినా పథకాలు ఆగవు

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే

ఆర్మూర్/మాక్లూర్/నందిపేట: ప్రభుత్వాలు మారినా పథకాలు ఆగవని ప్రతి పేదవాడు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సూచించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు సహాయం అందించేందుకు ఈ నిధులు మంజూరు చేస్తోందన్నారు. లబ్ధి పొందడానికి దళారులెవ్వరికీ డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. ఆర్మూర్‌లో 29 మందికి, నందిపేటలో 57 మందికి, మాక్లూర్‌లో 19 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్త గుండా గంగారాం కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సోమవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన గంగారాం నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

కాంగ్రెస్ హయాంలో అందరికి న్యాయం

- బాన్సువాడ కాంగ్రెస్ నేత ఏనుగు రవీందర్ రెడ్డి



గ్రామస్తులను ఆహ్వానిస్తున్న రవీందర్ రెడ్డి

రుద్రూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, అందుకే చాలా మంది పార్టీలో చేరుతున్నారని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో సొంత జాగాలో ఇళ్లు నిర్మించుకున్న అర్హులందరికి బిల్లులను కాంట్రాక్టర్ ద్వారా ఇప్పించే బాధ్యత స్థానిక నాయకులు చేపట్టాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, డీసీసీ కార్యదర్శులు కొట్టం మనోహర్, గంగాధర్ దేశాయ్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ కన్వీనర్ యలమంచిలి శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీపీ గంధపు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాట కాంగ్రెస్ నిలబెట్టుకుంటుంది



జీరో కరెంట్ బిల్ అందిస్తున్న కాంగ్రెస్ నేతలు

బాల్కొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలో గృహజ్యోతి పథకంలో భాగంగా లబ్ధిదారుకు జీరో బిల్లును అందజేశారు. గత ప్రభుత్వం మాదిరిగా మాట తప్పే ప్రభుత్వం తమది కాదన్నారు. పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, జావిద్, శ్రీనివాస్ గౌడ్, ఊశన్న పాల్గొన్నారు.

ముప్కాల్ మండల కేంద్రంలో..

ముప్కాల్ మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని ట్రాన్స్‌కో అధికారులు సోమవారం అమలు చేశారు. లబ్ధిదారులకు 'జీరో' బిల్లు అందజేశారు. ట్రాన్స్‌కో ఏఈ రవి, బిల్ కలెక్టర్ శ్రీనివాస్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం



రుద్రూర్‌లో ప్రారంభిస్తున్న ఎంపీడీవో సురేష్ బాబు



డొంకేశ్వర్ తహసీల్‌లో..

రుద్రూర్: కోటగిరి, రుద్రూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఎంపీడీవోలు మనోహర్ రెడ్డి, సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పుల సవరణ, అర్హులై ఉండి పథకం జాబితాలో లేనట్టయితే జాబితాలో చేరుస్తారని పేర్కొన్నారు.

డొంకేశ్వర్‌లో..

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డొంకేశ్వర్ మండల కేంద్రంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేయగా తహసీల్దార్ వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

బాల్కొండ: మెండోరా మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులను సోమవారం ఎంపీడీవో వనజ స్వీకరించారు. చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిరంతరం ఉంటుందని, ప్రజాపాలన దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని ఆమె సూచించారు. ఎంపీవో సాయిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు మెజార్టీతో గెలిపించుకుంటాం



పెర్కిట్(ఆర్మూర్): నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను గతంలో కన్నా రెట్టింపు మెజార్టీతో గెలిపించుకుంటామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ ధీమా వ్యక్తం చేశారు. మామిడిపల్లిలో సోమవారం ఆయన మాట్లాడారు. నిజామాబాద్ కేంద్రంగా పసుపు రీజనల్ కార్యాలయం, ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటుతో పాటు ధర్మపురి ఫౌండేషన్ ద్వారా అనారోగ్యానికి గురైన చిన్న పిల్లలను ఆదుకుంటున్న ధర్మపురి అర్వింద్‌ను నిజామాబాద్ ప్రజలు మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, దోండి ప్రకాష్, మిర్యాల్‌కర్ కిరణ్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	మా ఊరి రాజారెడ్డి - 10.30
	వ్యూహం (తెలుగు) - 1.00
	ఊరు పేరు భైరవకోన - 3.45
	ముఖ్య గమనిక (తెలుగు) - 7.00
	కిక్ (తెలుగు) - 9.45
స్క్రీన్-2 -	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 12.15, 3.10, 6.05, 9.00
స్క్రీన్-3 -	ఊరు పేరు భైరవకోన (తెలుగు) - 12.45, 10.00
	హనుమాన్ (తెలుగు) - 3.45
	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)-7.05
స్క్రీన్-4 -	ఇంటి నెంబర్ -13 - 10.45
	చారి-111(తెలుగు) - 1.30, 7.20
	భూతద్దం భాస్కర్ - 4.20, 10.10

బాల్కొండలో నిలిచిన ప్రసవాలు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

బాల్కొండ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలను పూర్తిగా నిలిపేశారు. గతంలో వారానికి రెండు రోజులు(మంగళవారం, గురువారం) ప్రసవాలు చేసేవారు. ప్రస్తుతం వైద్యులు లేకపోవడంతో మొత్తంగా ఆపేశారు. ఈ నడుమ బాల్కొండ క్లస్టర్ ఆస్పత్రిని వైద్యావిధాన పరిషత్తుకు అప్పగించారు. కాని సౌకర్యాలు ఏమాత్రం కూడా మెరుగు పడలేదు. ప్రస్తుతం ఆస్పత్రిలో అసిస్టెంట్ సివిల్ సర్జన్, దంత వైద్యుడు, అయుష్మాన్ భారత్‌కు చెందిన ఓ వైద్యుడు ఉన్నారు. ప్రధానంగా కాన్పులు చేసే గైనాకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉంది. మత్తు వైద్యుడు లేరు. దీంతో ఆస్పత్రిలో ప్రసవాలను నిలిపేశారు. ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాస్పత్రిలో గతంలో విధులు నిర్వహించిన వైద్యులను బదిలీపై భీంగల్ ప్రభుత్వాస్పత్రికి పంపించారు. అయినా అక్కడ ఆస్పత్రి భవనం అసంపూర్తిగా ఉండటంతో గైనకాలజిస్టును డిప్యుటేషన్‌పై బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. కానీ పది రోజుల క్రితం డిప్యుటేషన్‌ను రద్దు చేశారు. మత్తు డాక్టర్ పోస్టు గతం నుంచే ఖాళీగా ఉంది. వారంలో రెండు రోజులు అద్దెపై తెచ్చుకుని ఆపరేషన్లు చేశారు. ప్రస్తుతం ఆ సౌకర్యం కూడ లేదు. ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో కిసాన్‌నగర్, మెండోరా, పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. నిత్యం 100 మంది ఓపీ ఉండే పీహెచ్‌సీలు ఉన్నాయి. బాల్కొండలో క్లస్టర్ ఆసుపత్రి ఉంది. ఇన్ని ఆస్పత్రులకు ఆధారమైన బాల్కొండ క్లస్టర్ ఆస్పత్రిలో ప్రసవాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటే స్థానిక ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఉన్నత అధికారులు, పాలకులు స్పందించి వెంటనే గైనకాలజిస్టు, మత్తు వైద్యులని వెంటనే నియమించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో ఖాళీగా ఉన్న బెడ్లు